సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం । 18 । జూలై । 2023



అటవీశాఖ పర్యవేక్షణేది?
అటవీ అధికారుల పర్యవేక్షణ లేక చెట్లు నరికేసి పొలాలుగా మారుస్తున్నారు.
వివరాలు 8లో ▸



సీపీఎస్ విధానం రద్దుకు..
సీపీఎస్ విధానం రద్దు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.7 /22.2

వాతావరణం
ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నటరాజ్‌కు బంగారు పతకం



పాలమూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన వార్షిక సమావేశంలో మూడు దశాబ్దాలుగా మహబూబ్‌నగర్ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ చేసిన సామాజిక సేవ కార్యక్రమాలకు గాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బంగారం పతకం అందజేశారు. 2021– 22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా అందించిన సామాజిక సేవలను గుర్తించి నటరాజ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీలో ఇద్దరికి మాత్రమే బంగారు పతకం ఇవ్వగా.. తెలంగాణ నుంచి నటరాజ్ ఎంపికవడం విశేషం.

తగ్గనున్న ఐసీటీసీ కేంద్రాలు

పాలమూరు: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ ట్రెనింగ్ సెంటర్) కేంద్రాలు హేతుబద్ధీకరణ పేరుతో మూతపడనున్నాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 20 ఐసీటీసీ కేంద్రాలు ఉండగా వీటిలో బాదేపల్లి (జడ్చర్ల), కల్వకుర్తి, ఆమనగల్, కొడంగల్ కేంద్రాలు మూతబడి 16 కేంద్రాలకు పరిమితమయ్యే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఐసీటీసీ కేంద్రాల్లో గర్భిణులతోపాటు సాధారణ రోగులకు సర్జరీలు, అవసరమైతే హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆయా ఐసీటీసీ కేంద్రాలను కుదించడానికి వివరాలు సేకరిస్తోంది. ఆయా కేంద్రాల్లో మూడేళ్ల నుంచి నిర్వహిస్తున్న నిర్ధారణ పరీక్షలు, వ్యాధి తీవ్రత బాధితుల వివరాలను సేకరించాలని ఆ శాఖ సూచించింది. ఈ మేరకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వివరాలను కేంద్రానికి నివేదించింది. గడిచిన మూడేళ్లలో తక్కువ రోగులు ఉండే కేంద్రాలను మూసివేయనున్నట్లు సమాచారం. అయితే తక్కువ కేసులు నమోదయ్యే కేంద్రాలను మూసేయడం సరికాదని ఉద్యోగులు వాపోతున్నారు. ఐసీటీసీ కేంద్రాలు ఎత్తివేయనుండటంతో వాటిలో పనిచేసే సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జరీనాను వివరణ కోరగా జాతీయ స్థాయిలో తొలగింపు కార్యక్రమం నడుస్తోందని, వచ్చే నెల నుంచి బాదేపల్లిలో ఐసీటీసీ సెంటర్‌లో సేవలు అందుబాటులో ఉండవని చెప్పారు. అక్కడ పనిచేసే సిబ్బందిని అవసరమైన చోట నియమిస్తామని పేర్కొన్నారు.

పెద్దగుట్టకు ఉత్సవ శోభ

- నేటి నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు
- అధిక మాసంతో రెండునెలలపాటు వేడుకల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ

- వివరాలు 9లో..

● నాగర్‌కర్నూల్ టు నడిగడ్డ

‘సీన్’ చేంజ్..!

- జోగులాంబ జిల్లాపై కాంగ్రెస్ ప్రత్యేక నజర్
- ఇప్పటికే జెడ్పీ చైర్‌పర్సన్ చేరిక ఖరారు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సోదరుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి సైతం..
- అధికార పార్టీ అసమ్మతి నేతలందరితో రేవంత్ మంతనాలు
- వచ్చే ఎన్నికల్లో గద్వాల, అలంపూర్‌లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- తెరపైకి బీసీ వాదం.. రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్


రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా **చాటాలనే** లక్ష్యంతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా **వ్యవహరిస్తోంది.** ఉమ్మడి పాలమూరులో పునర్ **వైభవాన్ని** చాటేందుకు పక్కాప్లాన్‌తో ముందుకు **సాగుతోంది.** ప్రధానంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ **నియోజకవర్గం**పై ఇదివరకే నజర్ వేసిన ఆ పార్టీ **పెద్దలు** ఏ ఒక్క అవకాశాన్ని వదిలిపెట్టొద్దనే **పట్టుదలతో** పావులు కదుపుతున్నారు. బీఆర్‌ఎస్ **నుంచి మాజీ** మంత్రి, సీనియర్ నేత, కొల్లాపూర్ **నియోజకవర్గా**నికి చెందిన జూపల్లి కృష్ణారావు **బహిష్కరణ** తర్వాత సంప్రదింపులకు శ్రీకారం **చుట్టి.. ఆయ**నను సొంత గూటికి తీసుకురావడంలో **సఫలీకృతు**లయ్యారు. అదేవిధంగా బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్‌రెడ్డి సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేశారు. వనపర్తి నియోజకవర్గంలో అధికార పార్టీ బీఆర్‌ఎస్ అసమ్మతులు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి తదితరులు సైతం చేయి అందుకోనున్నారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో జూపల్లితో మొదలైన చేరికల పరంపర నడిగడ్డగా పేరొందిన జోగుళాంబ గద్వాల జిల్లాకు పాకింది.

■ అసమ్మతి నేతలతో మాటాముచ్చట..

కాంగ్రెస్‌లోకి బడా నేతల చేరిక నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మరింత దూకుడు పెంచినట్లు తెలుస్తోంది. గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పొసగకపోవడంతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరితాతిరుపతయ్య కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం చేసుకున్న విషయం తెలిసిందే. ఆమెతోపాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సోదరుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి సైతం హస్తం గూటికి చేరనున్నారు. రేవంత్‌రెడ్డితో ఆయనకు పాత పరిచయం ఉంది. దీంతో రేవంత్‌రెడ్డి.. చంద్రశేఖర్‌రెడ్డితోపాటు సరితాతిరుపతయ్యతో కలిసి అసమ్మతి నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సరిత, చంద్రశేఖర్ వేర్వేరుగా రోజుకో మండలం చొప్పున పర్యటిస్తున్నారు. అసమ్మతి నేతలు మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరేలా సన్నాహాలు ముమ్మరం చేశారు. మరోవైపు గద్వాల, ధరూర్, మల్దకల్, కేటీదొడ్డి, గట్టు మండలాల్లోని బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలతో రేవంత్‌రెడ్డి సైతం స్వయంగా ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. అలంపూర్ నియోజకవర్గంలో సైతం చాపకింద నీరులా కాంగ్రెస్ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు వినికిడి. సరితాతిరుపతయ్యతో కలిసి ఓ జెడ్పీటీసీ సభ్యుడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు జిల్లాలో చర్చ జోరుగా సాగుతోంది.



సరిత, జెడ్పీ చైర్‌పర్సన్ | బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి | రాజీవ్



తెరపైకి బీసీ ఫార్ములా..

మారుతున్న రాజకీయ పరిణామాల క్రమంలో **గద్వాలలో** బీసీ ఫార్ములా తెరపైకి వచ్చింది. కాం**గ్రెస్ సైతం** ఇదే నినాదంతో ముందుకెళ్లాలనే యోచ**నలో ఉంది.** కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ **సరితాతిరుపత**య్య కురువ సామాజికవర్గానికి చెం**దినవారు కాగా..** గద్వాల, అలంపూర్‌లో ఈ వర్గా**నికి చెందిన ఓ**టర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. దీం**తో వీరి రాకతో** కాంగ్రెస్‌లో జోష్ నెలకొంది. సర్వేల **ఆధారంగా టి**కెట్ కేటాయిస్తామని పార్టీ అధిష్ఠానం **చెబుతున్నప్ప**టికీ.. సరితాతిరుపతయ్యకే ఖరారైన**ట్లు గద్వాల** నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. **మరోవైపు** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ సైతం బీసీ సామాజిక వర్గానికి చెందినవారే. కాంగ్రెస్‌లో ఉన్న ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈయన కూడా టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరే కాకుండా బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో ఇద్దరు నాయకులు కాంగ్రెస్‌లో చేరాలని యోచిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలను బేరీజు వేసుకుంటున్న వారు త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయి తే పోటీ లేకుండా బీసీ వర్గానికి చెందిన ఒకరు ఎన్నికల్లో నిలబడితే గెలిచే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

22న కాంగ్రెస్ ప్రజాగర్జన

ఈ నెల 22న గద్వాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాగర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఖరారు అయ్యింది. ఈ నేపథ్యంలో గద్వాల నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన పలువురు అసమ్మతి నేతలతోపాటు స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇందులో ఎమ్మెల్యే సోదరుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నారు. నియోజకవర్గంలో తనకున్న పాత పరిచయాలతో అసమ్మతి నాయకులను నేరుగా వారి ఇళ్లకు వెళ్లి కలుస్తూ కాంగ్రెస్‌లోకి రమ్మని ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సుమారు 50 మంది వరకు గ్రామ, మండల స్థాయి నేతలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారిని ఈ నెల 22న జరిగే ప్రజాగర్జన సభలో రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరేలా చొరవ చూపుతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రధాన నాయకులు ఇలా పార్టీ వీడుతుండటంతో నామమాత్రంగా ఉన్న కాంగ్రెస్‌కు జవసత్వాలు వచ్చినట్లేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి



హన్వాడలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మళ్లీ 3 గంటల కరెంట్‌తో రైతులను ఆగం చేయాలని కుట్ర
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్ (హన్వాడ): రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ వద్దనే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని, అసలు వారిని గ్రామాల్లోకి రానీయొద్దని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాడు గురువు చంద్రబాబు, నేడు శిష్యుడు రేవంత్‌రెడ్డి తమ రైతు వ్యతిరేక బుద్ధి ని బయటపెట్టుకున్నారని, తక్షణమే రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పకుంటే వదిలే ప్రసక్తే లేదన్నారు. సోమవా రం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఓబ్లాయిపల్లి, హన్వాడలోని రైతువేదికలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయానికి 3గంటల కరెంట్ చా లన్న కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ ఏర్పాటు చేసిన రైతు అవగాహన సమావేశానికి మంత్రి హాజ రై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో రైతులను దివాళా తీయించారని, మళ్లీ 3 గంటల కరెంట్‌తో రైతును ఆగం చేయాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. నిన్న ధరణి, నేడు కరెంట్.. భవిష్యత్‌లో రైతుబంధు, రైతుబీమా సహా సంక్షేమ పథకాలు వద్దంటారని మంత్రి పేర్కొన్నారు. 24గంటల కరెంట్‌తో పంటల సాగు విస్తీర్ణం పెరిగి రైతులు బాగుపడుతుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతుందని, రైతు వ్యతిరేక రేవంత్‌కు రైతులే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతుల కోసం ఎంతో కష్టపడుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపైనే ఉందన్నారు. ఆయా సమావేశాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మండల రైతుబంధు అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, ఎంపీపీలు సుధాశ్రీ, బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, వైస్ ఎంపీపీ కె.అనిత, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావుద్దీన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రమ్య, మంగమ్మ, శ్రీకాంత్‌గౌడ్, ముడా చైర్మన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన సీఎం కేసీఆర్ : కాంగ్రెస్

అడ్డాకుల: వ్యవసాయ రుణాలు రూ.లక్ష మాఫీ చేయకుండా, 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వకుండా రైతులను మోసం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. రైతుబంధు డబ్బులను బ్యాంకర్లు వడ్డీ కింద జమ చేస్తూ రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం మూసాపేటలోని ఏపీజీవీబీ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు ప్రభుత్వమని చెప్పుకొనే బీఆర్‌ఎస్ రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రైతులను మరోసారి మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చిన మొదటి రోజే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. రుణమాఫీ, ఎరువులపై సబ్సిడీ, పంటల బీమా, యంత్ర పరికరాలపై సబ్సిడీ ఎత్తివేత, ఎరువుల ధరల పెరుగుదలపై రైతులు బీఆర్‌ఎస్ నాయకుల సమావేశాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు బంధు డబ్బులను రుణమాఫీ కింద జమ చేసుకోకుండా వాటిని రైతులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీజీవీబీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు శ్రీహరి, నాగిరెడ్డి, ప్రశాంత్, కృష్ణారెడ్డి, గోవర్ధన్, శకుంతల, సంతోషి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



‘కురుమూర్తి’కి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలైన్లో నిల్చున్న భక్తులు

చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల ఆరాధ్య దైవమైన కురుమూర్తిస్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాతసేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ.. గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు, అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామివారికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలుమంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపాన్ని భక్తులు దర్శించుకున్నారు.



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జాతర మైదానంలో భక్తుల రద్దీ

కాంట్రాక్టర్ గుత్తాధిపత్యం

- రూ.25 లక్షలైనా దాటని తైబజార్ వేలం
- సుమారు 30 ఏళ్లుగా ఒకే కుటుంబానికి టెండర్
- మున్సిపాలిటీలో ఏడేళ్ల వివరాలే లభ్యం
- కోవిడ్(2020– 21)లో రూ.3.49 లక్షలే చెల్లింపు
- చిరు వ్యాపారుల నుంచి మాత్రం ముక్కుపిండి వసూలు

పాలమూరు మున్సిపాలిటీ పరిధిలో ఏటా తైబజార్ వేలం వేస్తున్నా ఒకే కుటుంబం దక్కించుకుంటోంది. సుమారు 30 ఏళ్లుగా వారి గుత్తాధిపత్యమే కొనసాగుతోంది. వేలం పాటలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే పాల్గొంటుండగా.. ప్రతిసారి సదరు కుటుంబం మాత్రమే పైచేయి సాధిస్తుండటం గమనార్హం.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రం దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ పదేళ్లలో మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల్లో కొత్తగా ఎన్నో కాలనీలు వెలిశాయి. ఇందులోనే ఏనుగొండ, అప్పన్నపల్లి, ఎదిర, పాలకొండ, క్రిస్టియన్‌పల్లి, బండమీదిపల్లి, చిన్నదర్పల్లి, దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, బోయపల్లి విలీన గ్రామాలు ఉన్నాయి. మొత్తం 2,88,026 జనాభాకు గాను ప్రజా అవసరాలు విపరీతంగా పెరిగాయి. ఈ మేరకు పట్టణంలోని జడ్చర్ల– రాయచూర్ ప్రధాన రహదారిపై అప్పన్నపల్లి మొదలుకొని బండమీదిపల్లిలోని ఆర్టీఓ కార్యాలయం వరకు ఆయా ముఖ్య కూడళ్లలో వందలాది మంది చిరు వ్యాపారులు ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌లపై సీజనల్‌గా వివిధ రకాల వస్తువులు పెట్టుకుని అమ్ముతున్నారు. ఇటు రాంమందిర్ చౌరస్తా, షాబజార్, పాన్‌చౌరస్తా, పాతగంజ్, క్లాక్‌టవర్, మార్కెట్‌రోడ్, కోస్గిరోడ్, పాత బస్టాండు, బోయపల్లిగేట్, అటు వన్‌టౌన్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు అలాగే ఆయా వార్డుల్లోని ముఖ్య ప్రాంతాల్లోనూ అన్ని రకాల కూరగాయలు ఇబ్బడిముబ్బడిగా విక్రయిస్తున్నారు. వీటిలో చేపలు, మాంసం, చిన్నపాటి దుస్తులు, పండ్లు, పూలు, కొబ్బరి బోండాల దుకాణాలు కూడా ఉన్నాయి. వీరిలో కొందరు చిన్నపాటి టెంట్లు వేసుకోగా.. మరి కొందరు వ్యక్తులు నాలుగు చక్రాల బండ్లపైన టిఫిన్ సెంటర్లు వివిధ రకాల వస్తువులు పెట్టి విక్రయిస్తున్నారు. ఇంకొందరు గల్లీల్లోనూ తిరిగి విక్రయాలు సాగిస్తున్నారు.



కోస్గి రోడ్‌లో అటు, ఇటువైపు ఆకుకూరలు, కూరగాయలు, ఉల్లిగడ్డలు అమ్ముతున్న చిరు వ్యాపారులు



మార్కెట్ రోడ్‌లోని నాలుగు చక్రాల బండిపై దుస్తులు అమ్మే ఓ చిరువ్యాపారికి కాంట్రాక్టర్ ఇచ్చిన రసీదు

అయితే తైబజార్ కాంట్రాక్టర్ ప్రతిరోజూ కనిష్టంగా మార్కెట్ ఫీజు కింద ఒక్కొక్కరి నుంచి కనిష్టంగా రూ.20, గరిష్టంగా రూ.120 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇందులో అడ్డాల వద్ద నిత్యం కూరగాయలు, ఆకుకూరలు అమ్మేవారి నుంచి రూ.20 చొప్పున, తోపుడు బండ్లపై పండ్లు, ఇతర ఏ వ్యాపారం నిర్వహించినా రూ.30, కొబ్బరిబోండాలు విక్రయిస్తే రూ.40, అలాగే నాన్– లోకల్ ట్రాన్స్‌పోర్ట్ లారీల నుంచి రూ.120 చొప్పున తీసుకుంటున్నారు.

వేలంలో పాల్గొన్నది ముగ్గురే..
ఈ ఏడాది మార్చి 29న నిర్వహించిన తైబజార్ వేలం పాటలో కేవలం ముగ్గురు కాంట్రాక్టర్లు మాత్రమే పాల్గొన్నారు. వీరిలో ఎం.శంకరయ్య రూ.24,75,500, జి.సురేష్‌కుమార్ రూ.24,75,000, లక్ష్మమ్మ రూ.24,73,000 పాడారు. దీంతో అత్యధికంగా కోట్ చేసిన శంకరయ్యకు అధికారులు కాంట్రాక్టు కట్టబెట్టారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలానికి సంబంధించి కేవలం ఏడేళ్ల వివరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అంతకు ముందు జరిగిన లావాదేవీలకు ఎలాంటి రికార్డులు లేవని అధికారులు చెబుతున్నారు.

ఏడేళ్లలో మార్కెట్ ఫీజు ఇలా..

2017– 18లో నిర్వహించిన తైబజార్ వేలం పాటలో జె.కిషోర్ రూ.17,35,000లకు, 2018–19లోనూ అతనికే రూ.22,35,000లకు దక్కింది. ఇక 2019– 20 నుంచి 2023– 24 వరకు ఎం.శంకరయ్య తైబజార్ వేలం పాట కైవసం చేసుకున్నారు. ఇందులో 2019-20లో రూ.23,10,000, 2020– 21లో కోవిడ్ కారణంగా కేవలం రూ.3,48,890 మాత్రమే వచ్చింది. ఆ తర్వాత 2021– 22లో రూ.23,15,000, 2022– 23లో రూ.24,03,000, 2023– 24 ఆర్థిక సంవత్సరంలో రూ.24,75,500లకు పెరిగింది. ఇలా ఏటా స్వల్ప తేడాతో ఒక్కరే వరుసగా కాంట్రాక్టు దక్కించుకుంటున్నారు. ఈ ఇద్దరు కూడా సమీప బంధువులే కావడం గమనార్హం.

ఓపెన్ యాక్షన్ పెడుతున్నాం..

మున్సిపాలిటీలో తైబజార్‌కు సంబంధించి ఏటా ఓపెన్ యాక్షన్ పెడుతున్నాం. అందులో ఎక్కువ మంది కాంట్రాక్టర్లు పాల్గొనని విషయం వాస్తవమే. దీనిని నిర్వహించేందుకు మిగతా వారు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వేలం పాట కొద్దో.. గొప్పో ఎక్కువ పాడిన మేరకు పాత కాంట్రాక్టర్‌కే అప్పగిస్తున్నాం. ఎలాంటి పెండింగ్ లేకుండా అతను ఎప్పటికప్పుడు డిపాజిట్ చెల్లిస్తున్నారు. – ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

పల్లె వెలుగు బస్సుల్లో బస్‌పాస్ సౌకర్యం



పాలమూరు: ఆర్టీసీ మరో కానుకగా ప్రయాణికుల సౌకర్యార్థం పల్లె వెలుగు బస్సుల్లో టౌన్ బస్‌పాస్ అవకాశం కల్పిస్తున్నామని ఆర్ఎం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలో ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారని, అలాంటి వారికి ఆర్థిక భారం తగ్గించడానికి ‘పల్లె వెలుగు టౌన్ బస్‌పాస్’ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. పట్టణాల్లో తిరిగే పల్లె వెలుగు బస్సుల్లో అపరిమిత ప్రయాణానికి నెలకు రూ.800లతో నెల రోజుల పాటు పది కిలోమీటర్ల పరిధిలో ఎన్నిసార్లు అయినా ప్రయాణం చేయవచ్చన్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం నుంచి మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో పాసులు అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

సంపులో పడి బాలుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మున్సిపాల్టీ పరిధిలోని నాగనూలులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగనూలుకు చెందిన కృష్ణయ్య, కాశమ్మలకు ఇద్దరు పిల్లలు. ఎనిమిదేళ్ల కూతురుతో బాలుడు అరుణ్(6)ను పెట్టి తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లారు. సాయంత్రం సమయంలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందున్న నీటిసంపులో పడి మృతి చెందాడు. తర్వాత గమనించిన స్థానికులు బాలుడి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలంలోని కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని బోరవెల్లికి చెందిన హేమంత్‌కుమార్(21) ఆదివారం తన బైక్‌పై జల్లాపురం వైపు వెళ్తున్నాడు. జల్లాపురం గ్రామానికి చెందిన పులేందర్ ట్రాక్టర్‌పై ఎదురుగా వస్తూ బోరవెల్లి శివారులో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్సనిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పులేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్తంభంపై నుంచి జారిపడి వ్యక్తి..

ఆత్మకూర్: విద్యుత్ స్తంభం ఎక్కి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జూరాలకు తెలుగు శంకర్(50) కొంతకాలంగా తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. సోమవారం ఉదయం 9గంటల సమయంలో సొంత పొలంలో వాడుకలోలేని విద్యుత్‌స్తంభం ఎక్కిన శంకర్ ఒక్కసారిగా జారిపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీన్ని చూసిన చుట్టుపక్కల వారు వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

వనపర్తి: స్థానిక కోటమైశమ్మ ఆలయం పక్కనున్న 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గ్రీసింగ్ పనులు చేస్తూ విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. విద్యుత్ కాంట్రాక్టర్ సాయితో రేవల్లి మండలం అనంతపురం గ్రామానికి చెందిన శివాజీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కోటమైసమ్మ ఆలయం పక్కనున్న 33/11 విద్యుత్ సబ్ స్టేషన్‌లో సరఫరా ఆఫ్ చేసి గ్రీసింగ్ పనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్ రావడంతో షాక్‌కు గురయ్యాడు. షాక్ వల్ల వచ్చిన మంటలకు రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు అతన్ని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

మహిళపై రాయితో దాడి

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం మహిళపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. సోమవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం బైరాపురం చెందిన రాములమ్మ రెండవ కుమార్తెను జ్యోతిని తన తమ్ముడు బలరాముడుకి ఇచ్చి పదేళ్ల క్రితం రెండో వివాహం చేశారు. వివాహమైన ఏడేళ్ల క్రితమే భార్యాభర్తలకు మనస్పర్థాలు వచ్చి వేరువేరుగా ఉన్నారు. జ్యోతికి వేరే వివాహం చేసేందుకు బలరాముడిని తన అక్క రాములమ్మ, కుటుంబ సభ్యులు అఖండనాయుడు, స్వాములు, స్వప్న అడగడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విడాకులు ఇవ్వకుండా బలరాముడి తమ్ముడు శివరాముడు అతని భార్య భాగ్యలక్ష్మి, ఇంకో తమ్ముడు జయరాముడు అతని భార్య రాజేశ్వరి అడ్డుకుంటున్నారని కోపంతో రాములమ్మ ఎక్కడంటే అక్కడ తిడుతుండేవారని తెలిపారు. సోమవారం ఉదయం రాజేశ్వరి పొలం పనుల కోసం కూలీలను పిలవడానికి రాములమ్మ ఇంటి ముందు వెళ్తుండగా రాజేశ్వరిని అడ్డుకుని రాయితో రాములమ్మ దాడి చేసిందని తెలిపారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు రాములమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

గండేడ్: చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందిన ఘటన సోమవారం గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్దవార్వాల్‌కు చెందిన శివ్వని నర్సింహులు పశువులను పెంచుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి పశువులను పొలం దగ్గర ఉన్న కొట్టంలో కట్టేసి ఇంటికొచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగదూడ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, గుట్ట ప్రాంతంలో వెతుకగా చిరుత తీసుకెళ్లి చంపితిన్నట్లు గుర్తించాడు. వెంటనే గ్రామస్తులకు, రైతులకు సమాచారం అందించాడు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలిపాడు.

అటవీశాఖ పర్యవేక్షణేది?

- అన్యాక్రాంతమవుతున్న అటవీభూములు
- గుట్టుచప్పుడు కాకుండా చెట్ల నరికివేత
- ఎకరాలకొద్ది అడవుల మాయం..
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం



గాధిర్యాల్‌లో అటవీభూమిని వ్యవసాయ పొలంగా మార్చిన ప్రాంతం

మహమ్మదాబాద్: అటవీభూములను రక్షించే అధికారుల పర్యవేక్షణ లేక చెట్లు నరికేసి కబ్జా చేస్తూ పొలాలుగా మారుస్తున్నారు. తమకు ప్రభుత్వం భూములకు పట్టాలిచ్చిందంటూ చెట్లు తొలగిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా మరికొందరు అడవులు నరికి వ్యవసాయ పొలాలుగా మార్చుకున్నారు. ప్రభుత్వం అసైన్డ్ కమిటీ ద్వారా కొందరు రైతులకు పట్టాలిస్తే, దాన్ని అడ్డుపెట్టుకొని మరికొందరు నకిలీ అసైన్డ్ పట్టాపుస్తకాలు సృష్టించుకున్నారు. ఇంకొందరు ఆ పట్టాలతో రైతుబంధు, పంటరుణాలు తీసుకుంటూ యథేచ్ఛగా అనుభవిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అటవీశాఖ అధికారులు మాముళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారు. ఇటీవల గాధిర్యాల్‌లో కొందరురైతులు ఫిర్యాదులు చేయగా వారిపై కేసులు నమోదు చేశారు. ఉమ్మడి గండేడ్ మండల వ్యాప్తంగా మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలో గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట్, షేక్‌పల్లి, ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి, జూలపల్లి, కొండాపూర్ గ్రామాల్లో అటవీశాఖ భూములు కబ్జాకు గురవుతూనే ఉన్నాయి.

నిర్లక్ష్యం వల్లే అటవీభూములు కబ్జా..

అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న భూముల్లో తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందంటూ రైతులు చెట్లను నరికే సమయంలో కనీసం అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారిని నివారించడం లేదు. యథేచ్ఛగా నాలుగేళ్లుగా చెట్ల నరికివేత కొనసాగుతున్నా అధికారులకు చీమకుట్టినట్టుగా కూడా లేదు. చదునుచేసిన పొలాల్లో ప్లాంటేషన్ చేస్తామని అధికారులు వెళ్తే రైతులకు, అధికారులకు గొడవలవుతున్నాయి. మొదట్లోనే అధికారులు అడ్డుకుంటే తాము చెట్లు నరికే వారం కాదని, ఇప్పుడు కేసులు పెట్టి నష్టం చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు (ఫైల్)

బోగస్ పట్టాలతో రైతుల తిష్ట

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అసైన్డ్ కమిటీ ద్వారా కాకుండా బోగస్ పట్టాలు సృష్టించుకొని ఆన్‌లైన్‌లో చేర్చుతున్నారు. కొందరు పట్టా భూముల అనుకొని ఉన్న అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. మరికొందరు రైతుబంధు, పంట రుణమైన వస్తుందని అటవీభూములను కబ్జా చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారం గాధిర్యాల్, ధర్మాపూర్, అన్నారెడ్డిపల్లి, జూలపల్లి గ్రామాల్లో అధికంగా ఉంది.

అడవిని రక్షించాలి



మండలంలోని ఆయా గ్రామాల్లోని అటవీశాఖ, ప్రభుత్వ భూములను సంబంధిత అధికారులు రక్షించలేక పోతున్నారు. దీంతో పట్టాలున్న వారు, అడవి ప్రాంతాలకు దగ్గరగా ఉన్న రైతులు చెట్లు నరికి కలుపుకుంటున్నారు. కొందరు రైతులు బోగస్ పట్టాపాసుపుస్తకాలతో ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. అలాంటి వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. – వేణుగౌడ్, మహమ్మదాబాద్

హద్దుల్లేవు..



అటవీ భూములకు హద్దులు లేకపోవడంతో పక్కనున్న రైతులు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు. కొందరు చెట్లు నరికి గుట్టలను సాగు చేస్తున్నారు. అటవీభూములకు హద్దులు చేస్తే రైతులెందుకు కబ్జా చేస్తారు. వేలల్లో ఖర్చు చేసి సాగులోకి తెచ్చుకున్నాక వారిపై కేసులు చేస్తున్నారు. ఇందులో అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు బలవుతున్నారు. – రాఘవేందర్‌రెడ్డి, గాధిర్యాల్

అక్రమార్కులపై చర్యలు..

ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమంగా అడవులను నరుకుతూ కబ్జాలకు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. అటవీప్రాంతంలో భూములున్నవారికి న్యాయం చేసేందుకు రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే అనుమతి కోసం దరఖాస్తులు పెట్టాం. ఫారెస్టు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయించాకే రైతులు భూముల్లో పంటలు వేసుకోవాలి. – మగ్దూంహుస్సేన్, రేంజ్ అధికారి, మహమ్మదాబాద్

ఆధునిక సాంకేతికత వినియోగించుకోవాలి



రైతులకు కేవీకే శాస్త్రవేత్తల అవగాహన

మదనాపురం: రైతులు వ్యవసాయం రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని, పాత పద్ధతులను వీడి అధికారుల శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా నిర్విన్‌లో నిర్వహించిన రైతు సమావేశంలో ఆయన తోపాటు కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. సాంప్రదాయ పంటల సాగు చేస్తూ ఒకే రకమైన పంటలు వేయడం వల్ల సరైన దిగుబడి పొందలేక నష్టం వాటిల్లుతుందని, పంట మార్పిడి తోపాటు కందులు, పెసలు, ఇతర చిరుధాన్యాలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్త అనిత సూచించారు. ఇంటి పెరట్లో కూరగాయల పెంపకం, కోళ్ల పెంపకం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సాధించాలని కోరారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ దాదాసాహెబ్ భవాని కేవీకే సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పొలంలో మొసలి



వ్యవసాయ పొలంలో బంధించిన మొసలిని బయటకు తీసుకొస్తున్న స్నేక్ సొసైటీ నిర్వాహకులు హోంగార్డ్ కృష్ణసాగర్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అమ్మపల్లికి చెందిన రైతు విట్టా శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలంలో సోమవారం భారీ మొసలిని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు అడవిపందుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో మొసలి చిక్కుకుంది. ఈ విషయాన్ని మద్దిగట్లకు చెందిన ప్రసాద్‌సాగర్, రవిసాగర్‌లు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న స్నేక్ క్యాచర్ హోంగార్డ్ కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. వెంటనే అమ్మపల్లికి చేరుకున్న కృష్ణసాగర్ మొసలిని ఎంతో శ్రమించి బంధించి బయటకు తీసుకొచ్చారు. మొసలి బరువు 180 కిలోలు, 9అడుగులు ఉంటుందని ఆయన తెలిపారు. వనపర్తి డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి సూచనల మేరకు మొసలిని కృష్ణానది పరివాహక ప్రాంతమైన బీచుపల్లి బ్రిడ్జి వద్ద నీటిలో వదిలేశారు. మొసలిని పట్టుకోవడానికి శ్రమించిన స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్, దేవేందర్, లక్ష్మీనరసింహ, అవినాస్ సాగ ర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నరేష్, ఆంజనేయులు ఉన్నారు.

ఆర్టీసీ నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2020 సంవత్సరంలో 56 రోజులపాటు తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె చేశారని ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇప్పటి వరకు 4 పీఆర్‌సీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 8 డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాక 12 వేల మంది రిటైర్డ్ అయ్యారని, కానీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని దుయ్యబట్టారు. దీంతో ఉన్న ఉద్యోగులపై పని భారం పెరగడంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వారికి ఓటీలు వేసి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు 27 గైనిక్ సెలవులు ఉండగా వీటిని 18కి మించి ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. సీనియార్టీ ఉన్న టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు రూ.40 వేల వేతనం ఉంటే అదే సీనియారిటీ ఉద్యోగికి ఏపీఎస్ ఆర్టీసీలో రూ.లక్ష వరకు ఉందన్నారు. రాత్రి పూట మహిళా కండక్టర్లకు విధులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మహిళా అధ్యక్షురాలు అనిత, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ బెనహర్, నాయకులు అబ్దుల్‌హక్, ఇమ్రాన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రాజోళి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఖాదర్ భాషా తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి మండలం బుడమరుసుకు కుర్వ శ్రీనువాసులు తన కుమార్తె భాగేశ్వరిని ఇటిక్యాల మండలం కారుపాకులకు చెందిన జయన్నకు ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశాడు. ఆ సమయంలో రూ.1.50 లక్షలు, ఆరు తులాల బంగారం కటన్ంగా ఇచ్చాడు. తర్వాత భాగేశ్వరికి కూతురు పుట్టింది. భర్త అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని భ్యాగేశ్వరి పుట్టింటికొచ్చి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు రాజోళి పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ



బీరువా తాళం విరగ్గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితురాల వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన విజయలక్ష్మి ఈనెల 14న బోనాల పండుగ కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. దీన్ని అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం బద్దలుగొట్టి రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం, తులం వెండి నగలను దోచుకెళ్లారు. గమనించిన స్థానికులు విజయలక్ష్మికి సమాచారం ఇవ్వగా ఆమె సోమవారం ఉదయం ఇంటికొచ్చి చూసింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, క్లూస్ టీంతో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.



హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఖాదర్ భాషా

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మరోసారి చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. స్థానిక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలోని పరుశరామ స్వామి ఆలయంలోని హుండీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. హుండీని ఆలయానికి దూరంగా తీసుకెళ్లి అందులోని నగదు, ఇతర వస్తువులను దోచుకెళ్లారు. రెండేళ్ల క్రితం ఇదే ఆలయంలో హుండీ దొంగతనం జరిగింది. తాజాగా హుండీలో రూ.15వేల నగదు, వెండి వస్తువులు ఉన్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ ఖాదర్ భాషా క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. గతవారం చిన్న ధన్వాడలోని మారెమ్మ ఆలయంలో చోరీ చేశారు. తాజాగా పచ్చర్ల ఆలయంలో చోరీ జరగడంతో మండలంలో కలకలం రేపుతోంది.

శ్మశానవాటికలో పేకాట

అడ్డాకుల: శ్మశానవాటికలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని వర్నె గ్రామానికి చెందిన ఆరుగురు సోమవారం ఊరి సమీపంలో ఉన్న శ్మశానవాటికలో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో బాలరాజు, సాయికృష్ణ, రామకృష్ణ, రాములు, రమేష్, కల్యాణ్ ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి రూ.1,350 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై..

కృష్ణా: మండల కేంద్రంలోని కృష్ణా రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నా 8 మందిని ఎస్‌ఐ విజయభాస్కర్ అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.1,800 స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి



ట్రాక్టర్ తిరుగబడడంతో ట్రాక్టర్‌పైన ఊశయ్య మృతదేహం



ఊశయ్య(ఫైల్)

మిడ్జిల్: వ్యవసాయమే ఊపిరిగా భావించి ట్రాక్టర్‌తో వరి నాట్ల కోసం పొలం దున్నుతుండగా, ట్రాక్టర్ తిరగబడి డ్రైవింగ్ చేస్తున్న రైతు మృతి చెందిన ఘటన సోమవారం మిడ్జిల్ మండల పరిధిలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన కొప్పుల ఊశయ్య(56) తన సొంత ట్రాక్టర్‌తో వరినాట్ల కోసం పొలం కరిగెట చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బురదలో దిగబడి చొచ్చుకుపోయింది. దీన్ని బయటికి తీసే క్రమంలో ట్రాక్టర్ తిరగబడడంతో బురదలో ఇరుక్కుపోయిన ఊశయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. దీన్ని గమనించి చుట్టుపక్కల వారు, కుటుంబసభ్యులు బయటికి తీశారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలిస్తామని ఏఎస్‌ఐ అస్రత్ సుల్తాన్ తెలిపారు. తండ్రికి పోస్టుమార్టం చేయొద్దని చిన్న కుమారుడు మధు ఇంట్లోకెళ్లి ఉరివేసుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులు తలుపులు బద్దలు కొట్టి అతన్ని బయటికి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాన్ని జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. ఊశయ్యకు భార్య వెంకటమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మామను హత్య చేసిన అల్లుడి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న సీఐ

మక్తల్: మామను హత్య చేసిన అల్లుడుని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం పస్పులకు చెందిన లక్ష్మప్ప పెద్ద కూతురు రేణుకకు జడ్చర్ల మండలం ఆలేరుకు చెందిన గోపిమల్లేష్ ఇల్లరికం తీసుకొచ్చి వివాహం చేశారు. మామ, అల్లుడి మధ్య ప్రతి రోజు గొడవ పడేవారు. 14వ తేదీన వ్యవసాయ పొలం వద్ద లక్ష్మప్పతోపాటు ఆయన కూతురు, ముగ్గురు కూలీలు పనులు చేస్తుండగా, అల్లుడు చెట్టుకింద కూర్చున్నాడు. మేము పని చేస్తుంటే నీవు చెట్టుకింద కూర్చుంటావా అని లక్ష్మప్ప అనడంతో గోపి మల్లేష్ కోపంతో కట్టెతో దాడి చేశాడు. దీంతో ఆయన మృతి చెందాడు. బావమరిది నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు చేసి అల్లుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ : 8 మందికి గాయాలు



గాయపడిన కూలీలను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల టౌన్: ఆవుదూడను తప్పించబోయిన బైక్ ఆటోను ఢీకొట్టడంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం ఆల్వాన్‌పల్లి సమీపంలో లక్ష్మీనారాయణ ఆశ్రమం వద్ద చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. బాదేపల్లికి చెందిన ఇబ్రహీం ఆటోలో కూలీలు బొగురమ్మ, మనెమ్మ, కళమ్మ, నీలమ్మ, నర్సమ్మ, రంగమ్మలను మిడ్జిల్ మండలం కొత్తపల్లికి కూలిపని కోసం తీసుకెళ్తున్నాడు. 167వ జాతీయ రహదారి ఆల్వాన్‌పల్లి సమీపంలోని లక్ష్మీనారాయణ ఆశ్రమం కాడ ఆలో వస్తోంది. కల్వకుర్తి నుంచి బిలాల్ అహ్మద్ బైక్‌పై వస్తూ ఎదురుగా వస్తున్న ఆవుదూడను తప్పించబోయి ఆటోను ఢీకొట్టాడు. దీంతో బైక్, ఆటో రెండు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఆవుదూడ మృతి చెందగా, ఆటో డ్రైవర్‌తో పాటు కూలీలకు తీవ్రగాయాలు కాగా, బిలాల్ అహ్మద్‌కు గాయాలయ్యాయి. బాధితుల అరుపులు, రోదనలు ఆకాశాన్నంటాయి. దీంతో బిలాల్‌అహ్మద్‌ను 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కూలీలను జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. రోజు కూలిపనులు చేసుకునే వారు ప్రమాదానికి గురికావడంతో వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

ఎద్దుల బండిని ఢీకొట్టిన కారు



కారు ఢీకొట్టడంతో గాయపడిన ఎద్దు

ఉండవెల్లి: ఎద్దుల బండిని వెనకనుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎద్దుల పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెంకట్రాముడు, మద్దిలేటి ఎద్దుల బండిపై పొలానికి వెళ్తున్నారు. జల్లాపురం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి కారుతో వేగంగా ఎద్దుల బండి వెనకనుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట్రాములు కాలు విరిగగా, మద్దిలేటి తలకు గాయాలయ్యాయి. ఎద్దుకు మధ్యభాగంలో ఎముకల విరగడంతో కర్నూల్‌కు తరలించారు. మరో ఎద్దుకు స్వల్ప గాయాలయ్యాయి. నేషనల్ హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

కాలేజీల్లో పెరిగిన కటాఫ్

- కొత్తగా అందుబాటులో 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు
- కోరుకున్న కాలేజీలో సీఎస్ఈ సీటు దక్కించుకున్న విద్యార్థులు
- రెండో విడత కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న సీటు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పెరగడం ఈసారి విద్యార్థులకు కలిసి వచ్చింది. అన్ని కాలేజీల్లోనూ కటాఫ్ పెరిగింది. చాలామంది కోరుకున్న కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కించుకోగలిగారు. మొత్తం భర్తీ అయిన సీట్లలో 62.5% కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. గత ఏడాది (2022) తొలి విడత కౌన్సెలింగ్‌లో జేఎన్‌టీయూహెచ్ (సీఎస్ఈ)లో బాలికలకు 422 ర్యాంకు వరకే సీటు వచ్చింది. ఈసారి బాలురకు 813వ ర్యాంకు వరకూ, బాలికలకైతే 962 ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీలో సీటు వచ్చింది. పేరున్న ప్రైవేటు కాలేజీల్లో గత సంవత్సరం గరిష్టంగా 3 వేల లోపు ర్యాంకు వరకే సీటు వస్తే, ఈసారి ర్యాంకు 4 వేలు దాటినా సీట్లు వచ్చాయి. కొత్తగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి రావడంతో ఈ ఏడాది అదనంగా 7,635 సీట్లు మంజూరయ్యాయి. కొన్నేళ్లుగా డిమాండ్ లేని సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో 6,930 సీట్లను కాలేజీలు రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సు సీట్లు పెంచుకున్నాయి. ఫలితంగా ఈ ఏడాది మొత్తం 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. కాగా ఇందులో 10 వేలకు పైగా కన్వీనర్ కోటాలో ఉన్నాయి.

రెండో దశలోనూ మంచి చాన్స్!

తొలిదశ కౌన్సెలింగ్‌ను పరిశీలించిన విద్యార్థులు రెండో దశపై ఆశలు పెంచుకుంటున్నారు. ఈ దశలో కూడా కటాఫ్ మరింత పెరిగే వీలుందని భావిస్తున్నారు. ఈ ఏడాది 1,56,879 మంది ఎంసెట్ అర్హత సాధించారు. వీరిలో 76,821 మంది తొలి విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నా 75,708 మంది మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 70,665 మందికి సీట్ల కేటాయింపు జరిగింది. నిజానికి ఇందులో వెయ్యి లోపు ర్యాంకర్లు జేఈఈలోనూ ర్యాంకులు పొంది ఉండే వీలుంది. జోసా ఆరవ రౌండ్ కౌన్సెలింగ్ త్వరలో చేపట్టే వీలుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎంసెట్‌లో సీటు వచ్చిన వాళ్లు ఎన్ఐటీల్లో సీట్లు వస్తే వాటిల్లో చేరే వీలుంది. కొంతమంది ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్తారు. మరికొంత మంది డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరతారు. మొత్తం మీద ఎంసెట్ తొలి రౌండ్‌లో సీట్లు వచ్చిన వారిలో 5 వేల మంది వరకూ రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రెండో రౌండ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న బ్రాంచీలో, కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తగా పరిశీలించి ఆప్షన్ ఇవ్వాలి

రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యార్థి తనకు వచ్చిన ర్యాంకును దృష్టిలో పెట్టుకుని ఆప్షన్లలో ప్రాధాన్యత నిర్ణయించుకోవాలి. దీనికన్నా ముందు.. తాను కోరుకునే కాలేజీలో తొలిదశలో ఏయే ర్యాంకులకు సీట్లు వచ్చాయి? నిట్ వంటి జాతీయ కాలేజీలకు ఏయే ర్యాంకర్ల వరకూ వెళ్లే చాన్స్ ఉంది? అనే దానిపై కొంత కసరత్తు చేయాలి. గుడ్డిగా ఆప్షన్లు ఇవ్వకుండా, అన్నీ పరిశీలించి ఇస్తే కోరుకున్న బ్రాంచీ, కాలేజీ దక్కడం ఖాయం.

– ఎంఎన్ రావు (గణిత శాస్త్ర అధ్యాపకుడు)

తొలి దశ కౌన్సెలింగ్‌లో ప్రధాన కాలేజీల్లో ఈ ఏడాది కటాఫ్ ర్యాంకులు ఈ విధంగా ఉన్నాయి...

యాజమాన్యం		ఓపెన్	బీసీ-ఏ	బీసీ-బీ	బీసీ-సీ	బీసీ-డీ	బీసీ-ఈ	ఎస్సీ	ఎస్టీ
ఓయూ-సీఎస్ఈ	బాలురు	1391	3918	1804	5687	1912	2788	6101	7349
	బాలికలు	1598	5524	2284	-------	2215	1900	7136	8414
సీఎస్ఈ (ఏఐ)	బాలురు	2848	6195	3798	19380	4842	4790	10923	11076
	బాలికలు	2877	4328	3901	-------	4724	5987	13355	13947
ఈసీఈ	బాలురు	3623	8934	6822	-------	6248	-------	14626	15567
	బాలికలు	4436	10084	6855	-------	6337	5447	15561	18188
జేఎన్‌టీయూ సీఎస్ఈ	బాలురు	813	1579	1245	-------	1199	1886	4013	4534
	బాలికలు	962	2290	1028	-------	1579	-------	6753	6196
సీఎస్ఈ-ఏఐ	బాలురు	1359	3501	2131	-------	2399	4692	8932	8547
	బాలికలు	1915	3975	2232	-------	2885	4478	9572	10293
సీబీఐటీ	బాలురు	1478	4509	2246	6314	2296	3014	861	11217
	బాలికలు	1903	5314	2198	-------	2695	3867	11527	12687
వాసవీ సీఎస్ఈ	బాలురు	2405	7050	3008	12034	3837	6072	12291	15812
	బాలికలు	2266	6968	3907	-------	3648	6916	14525	16040
వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి-సీఎస్ఈ	బాలురు	1712	4952	2636	3099	2636	4773	11919	14598
	బాలికలు	1935	4309	2683	5242	2755	4924	11642	18027
కేఎంఐటీ-సీఎస్ఈ	బాలురు	5120	16102	7260	20337	7654	10730	32950	30728
	బాలికలు	5682	21945	8948	28661	9125	15978	33023	55150
గోకరాజు-సీఎస్ఈ	బాలురు	4014	11077	7228	25132	6399	9195	22605	26200
	బాలికలు	5015	14331	7789	23320	7589	11614	21286	27220
నారాయణమ్మ-సీఎస్ఈ	బాలికలు	4634	13033	7004	28674	7446	13239	25241	27323

రాష్ట్రంలో తగ్గిన పేదరికం

13.18 % నుంచి 5.88% తగ్గుదల

- 27.61 లక్షల మందికి పేదరికం నుంచి విముక్తి
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 16.59% పేదలు
- అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో పేదరికంలో ఉన్నది 2.17% మందే
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత కొన్నేళ్లలో పేదరికం రికార్డు స్థాయిలో తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 2015–16 నుంచి 2019–21 మధ్య దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మంది బహుముఖీయ పేదిరికం నుంచి బయటపడ్డట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా పేదల సంఖ్య 24.85% నుంచి 14.96%కి తగ్గిందని పేర్కొంది. ఇదే కాలానికి తెలంగాణలో 27,61,201 మంది, ఏపీలో 30,19,718 మంది ప్రజలు బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు వివరించింది. ఈ మేరకు 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ రివ్యూ 2023' పేరిట నీతి ఆయోగ్ సోమవారం ఢిల్లీలో నివేదిక విడుదల చేసింది. నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కె. పాల్, డాక్టర్ అరవింద్ వీరమణి, నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ సంస్థ వైస్ చైర్మన్ సుమన్ బేరీ నివేదికను విడుదల చేశారు.

గ్రామాల్లో ఎక్కువగా పేదరికం తగ్గుదల

ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 2015–16 నాటికి 13.18 శాతం మంది పేదలు ఉండగా 2019–21 నాటికి వారి సంఖ్య 5.88%కి తగ్గింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 19.51% నుంచి 7.51% మంది, పట్టణ ప్రాంతాల్లో 4.92% నుంచి 2.73% మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. జాతీయ బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లోని విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల వంటి 12 అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5) ఆధారంగా నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది. తెలంగాణలో అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.59%, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 2.17% మంది పేదలు ఉన్నారు.

తెలంగాణలో ఎంపీఐ సూచికలు :

అంశం	2015-16	2019-21
1) పోషకాహారం లభించని వారు	31.09%	28.35%
2) కౌమార, పిల్లల మరణాలు	1.38%	1.15%
3) వైద్యం అందని బాలింతలు	10.87%	13.17%
4) పాఠశాలలకు వెళ్లని విద్యార్థులు	2.10%	1.35%
5) వంటచెరకు దొరకని వారు	31.67%	7.93%
6) మరుగుదొడ్లు లేని వారు	49.01%	24.41%
7) మంచినీరు లభ్యతలేని వారు	10.80%	3.36%
8) విద్యుత్ సదుపాయంలేని వారు	1.23%	0.44%
9) సొంత ఇల్లు లేని వారు	25.54%	20.49%
10) కనీస ఆస్తి లేని వారు	12.79%	8.51%
11) బ్యాంకు ఖాతా లేని వారు	7.46%	2.74%
12) పాఠశాల విద్య అందని వారు	15.83%	14.56%

తెలంగాణ జిల్లాల్లో పేదల జనాభా శాతం పరిస్థితి

జిల్లా	పేదల జనాభా శాతం (2019-21)	(2015-16)
ఆసిఫాబాద్	16.59%	-------
జోగులాంబ గద్వాల్	15.37%	-------
ఆదిలాబాద్	14.21%	27.12%
వికారాబాద్	12.50%	-------
కామారెడ్డి	11.90%	-------
మహబూబ్‌నగర్	10.27%	24.72%
మెదక్	9.34%	17.87%
వనపర్తి	8.86%	-------
నిర్మల్	7.14%	-------
సంగారెడ్డి	7.09%	-------
నిజామాబాద్	6.76%	21.06%
మహబూబాబాద్	6.45%	-------
వరంగల్ రూరల్	6.45%	-------
జయశంకర్ భూపాలపల్లి	6.33%	-------
నాగర్‌కర్నూల్	5.95%	-------
జగిత్యాల	4.77%	-------
మంచిర్యాల	4.43%	-------
నల్గొండ	4.40%	13.35%
భద్రాద్రి కొత్తగూడెం	4.33%	-------
యాదాద్రి భువనగిరి	4.24%	-------
సూర్యాపేట	3.89%	-------
రంగారెడ్డి	3.83%	5.31%
రాజన్న సిరిసిల్ల	3.68%	-------
సిద్దిపేట	3.39%	-------
ఖమ్మం	3.18%	13.75%
మేడ్చల్ మల్కాజ్‌గిరి	3.06%	-------
జనగాం	2.91%	-------
హైదరాబాద్	2.52%	4.21%
కరీంనగర్	2.50%	8.65%
వరంగల్ అర్బన్	2.41%	-------
పెద్దపల్లి	2.17%	-------
వరంగల్	-------	12.12%

శిథిలావస్థలో 'సోనాలబావి'

- చోళుల కాలంలో మింట్‌గా ప్రసిద్ధి
- 8వ శతాబ్దంలో నిర్మించిన ఆనవాళ్లు..
- బావి నుంచి గొల్లత్తగుడికి నేలబొయ్యారం
- బంగారం, వెండి నాణెల ముద్రణ ఇక్కడే..
- కోటిలింగాల వల్ల కోటిపర్తిగా గ్రామానికి పేరు..



ఇటుకలతో నిర్మించిన సోనాలబావి

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడుపర్తిలోని సోనాలబావికి పరిరక్షణ కరువైంది. చారిత్రక కట్టడాలను పునర్ నిర్మించే వారు లేక శిథిలావస్థకు చేరి కనుమరుగయ్యేలా ఉన్నాయి. 8వ శతాబ్దంలో రాష్ట్ర కూటులు సోనాలబావిని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. సోనాలబావిపై ప్రత్యేక కథనం..

రాష్ట్ర కూటులు పరిపాలించే సమయంలో కోడుపర్తి గ్రామానికి సమీపంలో గొల్లత్తగుడిని నిర్మించారు. అప్పట్లో జైనమతం ఈ ప్రాంతంలో వెల్లివిరిసింది. గొల్లత్తగుడి జైనులకు ప్రీతిపాత్రమైన ఆలయంగా నిర్మించారు. ఆ గుడికి అనుబంధంగా కోడుపర్తిలో సోనాలబావిని నిర్మించారు. ఈ రెండింటి నిర్మాణంలో వినియోగించిన ఇటుకలు ఒకటే కావటం గమనార్హం. గొల్లత్తగుడి నుంచి సోనాలబావికి నేలబొయ్యారం (సొరంగమార్గం) నిర్మించారు. గొల్లత్తగుడి వద్ద జరిగే జైన ఉత్సవాలకు గొల్లభామలు (యక్షిణిలు) నేలబొయ్యారంలో నుంచి వచ్చి సోనాలబావిలో స్నానాలు చేసేవాళ్లని పూర్వీకులు చెబుతారు. యక్షిణిలు వినియోగించిన బావి కావడం వల్ల ఇతరులు ఎవరూ బావిలో దిగేవారు కాదు. ఇంట్లో శుభ కార్యాలకు మాత్రమే ఆ నీటిని వాడుకునేవారు. దశాబ్దం క్రితం వరకు నీళ్లుండేవి. కాలక్రమేణా మట్టి పేరుకుపోవడంతో వట్టిపోయింది. ముక్కోణపు ఆకారంలో ఒకవైపు మెట్లు మూడువైపులా గోడలుండేవి.

కోటిలింగాల ప్రాంతం..

గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి ముందే ఈ ప్రాంతంలో కోటిలింగాలు ప్రతిష్ఠించినట్లు గ్రామస్తులు చెబుతారు. కోటిలింగాలు ఉండటంతో కోటిపర్తిగా పిలిచేవారని, కాలక్రమేణా కోడర్తిగా వాడుకలోకి వచ్చింది. చాలా ఏళ్లపాటు కోడ్పర్తి, గంగాపురం, ఆల్వాన్‌పల్లి, దుందుభీ పరిసరాల్లో ఎక్కడ తవ్వకాలు జరిపినా శివలింగాలు బయట పడేవి. నేటికీ అక్కడక్కడా శివలింగాలకు సంబంధించిన ఆనవాళ్లు బయటపడుతూనే ఉన్నాయి.

పరిరక్షించాల్సిన ఆవశ్యకత..

సోనాలబావిని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉంది.

బంగారం, వెండి నాణెలు ముద్రణ..

రాష్ట్ర కూటులు, చోళులు సోనాలబావిని మింట్ (ధనాగారం)గా వినియోగించేవారు. వారి కాలంలో ఈ ప్రాంతం రెండో రాజధానిగా వెలుగొందింది. ఆ సమయంలో ప్రత్యార్థులకు తెలియకుండా రహస్యంగా సోనాలబావి కింద బంగారం, వెండి నాణెలను ముద్రించే కేంద్రంగా వాడుకున్నారు. ఇక్కడ బంగారం, వెండి నాణాలను సోల (ఒకరకమైన కొలిచే పరికరం)లో కొలిచి ఇచ్చేవారు. అందుకే ఈ బావికి సోలాల బావిగా పేరు వచ్చింది, వాడుకలో సోనాలబావిగా మారింది.



శిథిలమవుతున్న మెట్లమార్గం

8వ శతాబ్దంలో నిర్మించిన బావి నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. బావి పైభాగం చెట్లు పెరిగి, మట్టి కూరుకుపోయి శిథిలావస్థకు చేరింది. బావిలోపల మెట్లమార్గం దెబ్బతిన్నది. 1200 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ చారిత్రక కట్టడాన్ని పరిరక్షించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. చరిత్రకారులు, పురావస్తుశాఖ అధికారులు బావికి పూర్వవైభవం తీసుకొచ్చి నేలబొయ్యారంపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉంది. సోనాలబావి నుంచి గొల్లత్తగుడి, అక్కడి నుంచి బాదేపల్లి పెద్దగుట్ట, గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి నేలబొయ్యారాలున్నాయని ప్రచారంలో ఉంది. నేలబొయ్యారాలను వెలికితీస్తే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

ఇలాంటి బావిని ఎక్కడా చూడలేదు..



మూడుమూలలు ఉండి ఇటుకలతో నిర్మించిన ఇలాంటి బావిని నా జీవితంలో ఎక్కడా చూడలేదు. బావిలో గొల్లత్తగుడి నుంచి దేవతలు స్నానానికి వచ్చేవారని మా పెద్దలు చెప్పేవారు. అందుకే మేం ఎవరం అందులోకి దిగేవాళ్లం కాదు. శుభ కార్యాలు జరిగితే మెట్లద్వారా వెళ్లి నీళ్ల తెచ్చుకునే వాళ్లం. 50ఏళ్ల కిందట బావిలో నుంచి 100 గుర్రాలు పరుగెత్తినట్లు, 100డప్పులు, 100 నాగస్వరాలు ఊదినట్లుగా శబ్దాలు వచ్చేవి. నేను విని భయపడేవాడిని.

– బాగం పెద్దయ్య, కోడ్పర్తి గ్రామస్తుడు

సోలలో బంగారం, వెండి నాణెలు కొలిచేవారు



ఇక్కడ సోలతో బంగారం, వెండి నాణెలు కొలిచి ఇచ్చేవారని, అందుకే సోలాలబావిగా పేరు వచ్చిందని మా పూర్వీకులు చెప్పారు. అదే తర్వాత సోనాలబావిగా మారింది. బావిలో మట్టికూరుకుపోయింది. మట్టిని తీసి బాగుచేస్తే బాగుంటది.

– బాల్‌నాగయ్య, కోడ్పర్తి గ్రామస్తుడు

పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి



కోడ్పర్తి గ్రామంలో బావి ఉందని తెలుసు. ఇంతటి చారిత్రక కట్టడమని ఇప్పుడే తెలుసుకున్నాం. సోనాలబావికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తాం. అవసరమైతే జీపీ నిధులతో బావిలో పూడిక తీయించి పునఃరుద్ధరిస్తాం. భావి తరాలకు చారిత్రాక కట్టడాన్ని అందించేందుకు మా వంతు కృషి చేస్తాం. – చంద్రకళ, సర్పంచ్, గంగాపురం గ్రామ పంచాయతీ

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి



గౌతాపూర్‌లో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

బాలానగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని అమ్మపల్లి లక్ష్మీనారాయణ స్వామి ఆలయ సమీపంలో బస చేసిన ఆయన సోమవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ప్రజాహిత పాదయాత్రను కొనసాగించారు. గౌతాపూర్, బోడజానంపేట్ మీదుగా సాగిన పాదయాత్ర రాజాపూర్ మండలంలో ప్రవేశించింది. అంతకుముందు ఆయా గ్రామాల్లో మాట్లాడిన ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. గౌతాపూర్ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించిన ఆయన సంవత్సరం క్రితం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని తాను ఆందోళన చేయగా నెల రోజుల్లో పెండింగ్‌లో పనులను పూర్తి చేసి పంపిణీ చేస్తామని తహసీల్దార్ అధికారిక ప్రకటన చేశారని, ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఎందుకు పంపిణీ చేయలేదో చెప్పాలన్నారు. పది రోజుల్లో పేదలకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేయాలని, లేకుంటే ఇళ్ల తాళాలు విరగొట్టి పేదలు వెళతారని హెచ్చరిస్తూ మహిళలతో కొబ్బరికాయలు కొట్టించారు. బాలానగర్ నుంచి చిన్నరేవల్లి వరకు ఉన్న బీటీ రోడ్డును రెండు వరసల రహదారిగా విస్తరిస్తామని, అందుకు అనుమతులు మంజూరయ్యాయని సమావేశాల్లో ఎమ్మెల్యేతోపాటు, మండల నాయకులు చెప్పారని, అది కూడా ఏడాది కాలంగా ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. నిధులు మంజూరైన పెద్దరేవల్లి రహదారికి రూ.30 లక్షలతో తిరిగి మరమ్మతులు ఎందుకు చేపట్టారో కూడా చెప్పాలని నిలదీశారు. ఒక వేల రోడ్డు విస్తరణ పూర్తయ్యి ఉంటే బీఆర్ఎస్‌కు చెందిన క్రియాశీల కార్యకర్త కృష్ణ మృతి చెంది ఉండేవాడా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో కుంటలు, చెరువులు కబ్జా అవుతాయని కానీ అభివృద్ధి చేయడం లేదన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి, పింఛన్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, 108 అంబులెన్స్, ఈజీఎస్ పథకాలు, పేద విద్యార్థుల చదువుకోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను తెచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, లక్ష్మణ్, బీల్యానాయక్, నవీన్ రెడ్డి, గణేష్ గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దుకు చలో హైదరాబాద్



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

కందనూలు/కల్వకుర్తి: తెలంగాణ రాష్ట్రంలోని లక్షా 80వేల సీపీఎస్ ఉద్యోగుల కోసం నూతన సీపీఎస్ విధానం రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్‌పీసీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సోమవారం పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర రెండో రోజు నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగింది. ఈ యాత్రకు మద్దతుగా జిల్లాలోని అన్ని డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ నుంచి బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. సీపీఎస్ పెన్షనర్ల సాధన కోసం వచ్చేనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులంతా కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్, కృష్ణ ప్రసాద్, జిల్లా నాయకులు అమరేందర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘీభావం..

సోమవారం సాయంత్రం కల్వకుర్తిలో పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర బైక్‌ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేవిధంగా అన్ని సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్, జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారావు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణప్రసాద్, వెంకటేష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ కిరణ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ కిరణ్

వనపర్తిటౌన్: విద్యారంగంపై శ్రద్ధ చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ కిరణ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్లైతే ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు పేరిట కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, ఈ ఉత్సవాల వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వీపనగండ్ల ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థి మహేందర్ పాము కాటుకు గురైతే ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వెంటనే ఆయన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ, గురుకులాల్లో పర్యవేక్షణ కరువైందన్నారు. జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ మన ఊరు – మన బడి పథకాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ, జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, జిల్లా నాయకులు ఈశ్వర్, మహేష్ పాల్గొన్నారు.

'మాదిగల విశ్వరూప మహాసభ'ను విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే నెల రెండో వారం నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు తరలిరావాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు కార్తిక్ అన్నారు. సోమవారం పీయూలో ఎంఎస్ఎఫ్ నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించేందుకు అంతిమ యుద్ధానికి మాదిగ ఉపకులాల విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటలు చెబుతున్నా, చేతల్లో చిత్తశుద్ధి లేదన్నారు. తక్షణమే వర్షాకాల పార్లమెంట్ సమావేశంలో బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గణేష్, సతీష్, పరశురాములు, కమలాకర్, ప్రభాకర్, భాస్కర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,017 అడుగుల నీరు ఉంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపి వేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.